క్లుప్తంగా

నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌కు సత్కారం



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్ సుధాకర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

దెందులూరు: ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌ను బుధవారం ఆయన కార్యాలయంలో సోమవరప్పాడు సెయింట్ జాన్స్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ సిబ్బంది సత్కరించారు. కళాశాల అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ మైఖేల్, అధ్యాపక సిబ్బంది సుందరీ, కాటన్ ప్రసాద్, అన్నరావు, రాజేష్, మేరుగు రాజ్‌కుమార్, రమణ ఉన్నారు.

ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పరామర్శ

దెందులూరు: వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటేటి కనకరాజు ఆకస్మిక మరణం తనని కలిచి వేసిందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. బుధవారం అలుగులగూడెంలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటేటి కనకరాజు ఇంటికి వెళ్లి కుమారులు ఆనంద్, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. దెందులూరు గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పోకల రాంబాబు, మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, దెందులూరు సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, ఎంపీటీసీలు పులిపాటి ఆనంద్, తోట విజయకుమారి అజిత్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొంగర రత్నకుమార్ అబ్బాస్, దెందులూరు ఎఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యార్థులకు చక్కటి వసతులు కల్పించాలి



కొండలరావుపాలెం పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజ్‌మనోజ్

పెదవేగి : ప్రభుత్వం విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రతి పథకం సద్వినియోగం అయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని పెదవేగి ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ అన్నారు. పెదవేగి మండలం కొండలరావుపాలెం ఎంపీపీ స్కూల్లో బుధవారం ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపీడీఓ, అక్కడ ఉన్న విద్యార్థులను మధ్యాహ్న భోజనం ఎలా ఉందని అడిగారు. చిన్నారులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చెప్పిన పలు సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను, ఎంఎల్‌హెచ్‌పీలను, ఏఎన్ఎంలను ఆదేశించారు.

నిరాధార ఆరోపణలు తగవు

ఏలూరు (టూటౌన్): వైద్య విద్యపై విపక్ష పార్టీల నేతలు నిరాధారమైన ఆరోపణలు చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఏలూరు జిల్లా నాయకులు పితాని దుర్గాప్రసాద్, సీఏపీఎస్ ఆచార్యులు, చదలవాడ వెంకటరమణ ఒక సంయుక్త ప్రకటనలో విమర్శించారు. టీడీపీ హయాంలో ప్రభుత్వ రంగంలో వైద్య కళాశాలలను ఏర్పాటు చేయకుండా ప్రైవేట్, కార్పొరేట్ వైద్య కళాశాలలకే పట్టం కట్టారని గుర్తుచేశారు. టీడీపీ నాయకులు, సానుభూతిపరులకు వైద్య కళాశాలలు ఏర్పాటు చేసుకోవటానికి అనుమతిచ్చి, వారి జేబులు నింపుకున్నారన్నారని విమర్శించారు. రాష్ట్రంలో 12 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉంటే సీఎం జగన్ రూ.8,480 కోట్ల వ్యయంతో ఏకంగా కొత్తగా 17 మెడికల్ కాలేజీలను నెలకొల్పుతున్నారని చెప్పారు.

ఆర్థిక బాధలతో ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఆర్థిక బాధలు తట్టుకోలేక యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు తూర్పువీధికి చెందిన నవలవరపు ప్రకాష్ (24) భార్య చిన్న దుర్గ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రకాష్ తాపీ పని చేస్తూ జీవిస్తున్నారు. చెడు వ్యసనాలకు బానిసై అప్పులపాలయ్యాడు. క్యాన్సర్ సోకిందనే అనుమానంతో తీవ్ర మనస్థాపానికి గురై బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. ఈ ఘటనపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎన్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కిడ్నాప్ చేసి హింసించారని ఫిర్యాదు

ఏలూరు టౌన్: భార్య బంధువులు తనను కిడ్నాప్ చేసి దాడి చేశారంటూ భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లికి చెందిన తాడిచెట్టు కృష్ణంరాజుకు అతని భార్యకు గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 22న రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో ఆమె మంగళగిరిలోని పుట్టింటికి ఫోన్ చేసింది. ఆమె బంధువులు వచ్చి కృష్ణంరాజును కొట్టుకుంటూ మంగళగిరి తీసుకెళ్లి చిత్రహింసలకు గురిచేశారు. వారి చెర నుంచి తప్పించుకొచ్చిన కృష్ణంరాజు ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గండికోట నాగరాజు, మరో ఆరుగురిపై కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి

- రహదారుల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- పెదపాడులో మండల సర్వసభ్య సమావేశం



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు : గ్రామాల్లో సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. గ్రామాల్లో వివిధ శాఖల పనితీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయ భవనాలు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ మండలంలోని రహదారులు అభివృద్ధి చేస్తున్నామని పెదపాడు పెరికీడు రహదారి పనులు వేగవంతం చేస్తున్నామని చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం దృష్టికి వచ్చిన సమస్యలు వాటి పరిష్కారంపై అధికారులను ప్రశ్నించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ నిరంతరాయంగా తొమ్మిది గంటలపాటు ఉచితంగా అందిస్తామన్నారు. ఏ గ్రామంలోనూ లో ఓల్టేజీ సమస్యలు లేకుండా చూడాలని విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. సత్యవోలులో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి త్వరలో అనుమతులు రావాల్సి ఉందన్నారు. మండలంలోని వట్లూరు కొప్పాక, వట్లూరు కొక్కిరపాడు, కలపర్రు-వట్లూరు రహదారులను అభివృద్ధి చేసామని, కలపర్రు దాసరిగూడెం రహదారి నిర్మాణంలో ఉందన్నారు. నాయుడుగూడెం-రాజుపేట, సత్యవోలు వడ్డిగూడెం, కొత్తూరు ముప్పర్రు రహదారికి అనుమతులు రావాల్సి ఉందన్నారు. రానున్న ఆరు నెలల్లో మిగతా రహదారులు సైతం పూర్తి చేస్తామని చెప్పారు. జేజేఎం ద్వారా నాయుడుగూడెం, కడిమికుంట, ఖాజీగూడెం సత్యన్నారాయణపురం, పెదపాడు గ్రామాల్లో పైపులైన్ల మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. గృహనిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లింపుచేయాలని సూచించారు. ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, వైస్ ఎంపీపీలు అప్పన పద్మావతి, రెడ్డి స్వర్ణకుమారి, ఎంపీడీవో ఎస్‌నిర్మల జ్యోతి, తహసీల్దార్ జీ విజయ్‌కుమార్ రాజు, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గొట్టాపు నర్సింహరావు, ఎంతఊట సబ్బితి నర్సింహమూర్తి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీని మండల పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

నేడు పోతునూరులో గడపగడపకు మన ప్రభుత్వం

దెందులూరు: పోతునూరు గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, సర్పంచ్ బోదుల స్వరూప్, సొసైటీ చైర్మన్ డీఎవీ ప్రసాద్ (బజ్జీ) అన్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలి

భీమడోలు: జాతీయ రహదారి భీమడోలు అయ్యప్ప స్వామి ఆలయం నుంచి కంచికామాక్షమ్మ కాలనీ వరకు సెంట్రల్ విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు భీమడోలు మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, పంచాయతీ వైసీపీ నేతలు పాము సునీతామాన్‌సింగ్, రామకుర్తి నాగేశ్వరరావు విన్నవించారు. జిల్లాలోని ప్రసిద్ధి గాంచిన ద్వారకాతిరుమలలో వేంచేసియున్న వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు రాకపోకలు సాగిస్తున్నారని, జాతీయ రహదారి కావడంతో పగలు రాత్రి తేడా లేకుండా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. రహదారిపై ఎటువంటి సెంట్రల్ లైటింగ్ సదుపాయం లేకపోవడంతో రాత్రి వేళల్లో తరచుగా భారీ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని వైసీపీ నేతలు ఎంపీని కలిసి వివరించారు. తక్షణమే స్పందించిన ఎంపీ కోటగిరి శ్రీధర్ హైవే అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్‌కు లైటింగ్ ఏర్పాటు చేయాలని సిఫారసు లేఖను అందించారు. బుధవారం వైసీపీ నేతలు రాజమహేంద్రవరంలోని హైవే ప్రాజెక్టు పీడీని కలిసి లేఖను అందించారు.

అక్రమ రవాణాకు చెక్ పెట్టాలి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో మద్యం, ఇసుక, మత్తుపదార్థాల అక్రమ రవాణాను అడ్డుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని సూచించారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్ఈబీ అదనపు ఎస్పీ నక్కా సూర్య చంద్రరావు ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం తన కుమార్తె వివాహ వేడుకలకు హాజరుకావాలంటూ ఆహ్వానపత్రికను నానికి అందజేశారు.

టంగుటూరి, గిడుగు జీవితాలు స్ఫూర్తిదాయకం



భీమడోలు: టంగుటూరి, గిడుగు వారి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



దెందులూరు: నర్సింగ్ కళాశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంత్యుత్సవం



పెదవేగి: టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓలు

భీమడోలు: ఆంధ్ర కేసరి, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు, గిడుగు వెంకట రామ్మూర్తి జీవితాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కెరీర్ గైడెన్స్ జిల్లా ప్రతినిధి తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో బుధవారం తొలి ఆంధ్ర రాష్ట్ర సీఎం టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతి, వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి జయంతి వారోత్సవాలను ప్రారంభించారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు, గిడుగు వెంకటరామ్మూర్తి చిత్రపటాలకు టీవీ ఉమామహేశ్వరరావు, పెద్దలు కడగల సత్యనారాయణ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

టంగుటూరి సేవలు చిరస్మరణీయం

భీమడోలు: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నేవారిగూడెం యూపీ స్కూలు ప్రధానోపాధ్యాయులు షేక్ మస్తాన్ అన్నారు. అన్నేవారిగూడెంలో యూపీ పాఠశాలలో బుధవారం ఆంధ్రరాష్ట్ర తొలి సీఎం టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. టంగుటూరి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలను పంచారు. ఈ కార్యక్రమంలో టీచర్లు ఎం.స్వర్ణలత, విజయకుమారి, దుర్గాప్రసాదిని, రవిభారతి, శారారాణి, జ్యోతిబసు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరి ఆదర్శనీయుడు

దెందులూరు: టంగుటూరి ప్రకాశంపంతులు జీవన విధానం, ఆలోచన విధానం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. బుధవారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ విద్యార్థులు టంగుటూరి ప్రకాశంపంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరస్పాండెంట్ టంగుటూరి ప్రకాశంపంతులు జీవన విధానం, విశిష్టతపై అవగాహన కల్పించారు.

ఘనంగా ఆంధ్రకేసరి జయంత్యుత్సవం

పెదవేగి : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంత్యుత్సవాన్ని పెదవేగి ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కార్యాలయానికి వచ్చిన సిబ్బంది టంగుటూరి చిత్రపటాన్ని ఏర్పాటుచేసి, ఎంపీపీ తాతా రమ్య అధ్యక్షతన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు దేశ నాయకుడిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, ముఖ్యమంత్రిగా ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. ప్రకాశం పంతులు చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచాయని ఆయన కీర్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజ్‌మనోజ్ కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పాలన

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- పోతునూరులో గడపగడపకు మన ప్రభుత్వం



పోతునూరులో చంద్రయాన్-3 విజయవంతంపై జాతీయ పతాకాలతో ప్రదర్శన నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, గ్రామస్తులు, నాయకులు

దెందులూరు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. బుధవారం రాత్రి పోతునూరులో దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, సర్పంచ్ బోదుల స్వరూప్, సొసైటీ చైర్మన్ డీఎస్‌వీ ప్రసాద్ (బజ్జి) ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులకు పోతునూరులో ఘన స్వాగతం లభించింది. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజల ఇబ్బందులను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం తలపెట్టారని అన్నారు. అర్హులైన వారికి కులం, మతం, పార్టీ, వర్గం చూడకుండా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలు విధిగా అందాలన్నది ముఖ్యమంత్రి అభిమతమన్నారు. హామీ ఇచ్చిన పథకాలతో పాటు అనేక కొత్త పథకాలు అమలు చేస్తూ ప్రతి ఒక్కరి అభివృద్ధి, సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారన్నారు. గడిచిన మూడున్నరేళ్లల్లో ప్రభుత్వం ద్వారా వచ్చిన పథకాల లబ్ధిని ఇంటింటా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి వివరించారు. ప్రపంచ మానవాళి చరిత్రలో నూతన అధ్యయనానికి నాంది పలికిన రోజుగా చంద్రయాన్-3 చందమామపైకి చేరిన రోజు గుర్తుండిపోతుందన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి ఇస్రో శాస్త్రవేత్తల చరిత్ర సృష్టించారని అన్నారు.

చంద్రయాన్-3 విజయవంతం జాతికి అంకితం

చంద్రయాన్-3 విజయవంతం జాతికి అంకితమని ప్రతి భారతీయుడు గర్వపడే రోజుగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అభివర్ణించారు. ప్రపంచ వ్యాప్తంగా భారతీయుల మేధస్సు దశ దిశలా విస్తరించి భారతదేశ కీర్తి ప్రతిష్టలను శాశ్వతంగా ఇనుమడింపచేసిన ఇస్రో శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బందికి అభినందనలు తెలిపారు. తొలుత పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, కార్యదర్శి రమేష్, రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ, పార్టీ నాయకులు బుద్దా అర్జున, బీశెట్టి నూకరాజు, కార్యకర్తలు ఉన్నారు.

చంద్రయాన్-3 విజయవంతంపై హర్షం



భీమడోలులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



భీమడోలులోని చంద్రయాన్- 3 రాకెట్ నమూనా

పెదవేగి : చంద్రయాన్-3 చరిత్ర సృష్టించింది. జాబిల్లిపై ఇప్పటివరకు ఏ దేశం దిగని దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండర్ కాలు మోపింది. సాయంత్రం 5.44 గంటలకు ల్యాండింగ్ ప్రక్రియ మొదలవ్వగా 6.04 గంటలకు చందమామను విక్రమ్ ల్యాండర్ ముద్దాడి, అంతరిక్షంలో భారత ప్రతిష్టను చాటి చెప్పింది. ఇక నేటి నుంచి 14 రోజులపాటు జాబిల్లిపై రోవర్ పరిశోధనలు జరపనుంది. దీంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో భాగంగా పెదవేగి మండలం విజయరాయి ఉన్నత పాఠశాల్లో స్థానిక పీడీ, సచివాలయ గ్రేడ్ 5 కార్యదర్శి సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులతో ఇస్రో అని తెలుగు అక్షరాల కూర్పుతో ఏర్పాటు చేసిన ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది.

దేశభక్తి చాటుతూ చిన్నారుల ర్యాలీ

భీమడోలు: చందమావను ముద్దాడే కీలక ఘట్టం చంద్రయాన్-3 విజయవంతం కావాలని కోరుతూ బుధవారం భీమడోలులోని ఓ ప్రైవేటు పాఠశాలల చిన్నారులు, టీచర్లు, యాజమాన్యం వీధుల్లో ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. 30 అడుగుల చంద్రయాన్ 3 రాకెట్ నమూనాతో వారంతా జాతీయ జెండాలను చేతపట్టుకుని నినాదాలు చేసుకుంటూ వీధుల్లో కదం తొక్కారు. భారీ రాకెట్ నమూనా చూపరులను ఆకట్టుకుంది. చిన్నారంతా దేశభక్తి చాటుతూ వారంతా భారత్‌మాతాకీ జై అంటూ నినదించారు. జాబిల్లి దక్షిణ ధ్రువ ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్ అడుగు పెట్టిన అద్భుత దృశ్యాలను దేశ ప్రజలంతా ఆసక్తిగా వీక్షించారని ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్ తెలిపారు.

ఉంగుటూరులో సంబరాలు

ఉంగుటూరు: చంద్రయాన్-3 విజయవంతంతో ఉంగుటూరులో బుధవారం సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణి ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ రోహిత్‌నాయుడు, గణపవరం మండలం బీజేపీ అధ్యక్షుడు కొయ్యల సుబ్బారావు పాల్గొన్నారు.



విజయరాయి ఉన్నత పాఠశాల్లో చంద్రయాన్-3 విజయవంతం సందర్భంగా ఇస్రో అనే పదాల ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన సమాజం



భీమడోలులో రైతులకు మందులు అందిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ

భీమడోలు: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్య వంతమైన సమాజ స్థాపన సాధ్యమని జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ వై.రామకృష్ణ అన్నారు. భీమడోలులో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం సంబంధిత వ్యవసాయాధికారులతో కలిసి ఆయన సందర్శించారు. జిల్లాస్థాయి అధికారులు పర్యవేక్షణలో సాగు చేస్తున్న గ్రామంలో 50 ఎకరాల విస్తీర్ణంలోని పంట పొలాలను ఆయన పరిశీలించారు. మేలైన వ్యవసాయ పద్ధతులపై రైతులకు తగు సూచనలను అందించారు. రైతులకు ఎరువులు, పురుగుమందులు వినియోగం, యాజమాన్య పద్ధతులపై ఆయన అవగాహన కల్పించారు. సీజన్‌కు వచ్చే ఆకుముడత తెగులు చేలకు సోకి నట్లు గుర్తించామని, అగ్నిఅస్త్రం కషాయాన్ని ఎకరానికి మూడు లీటర్లు స్ప్రే చేస్తే ఆకుముడత తెగుల ఉధృతి తగ్గి నిర్మూలన పొందవచ్చునన్నారు. వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని మెళకువలతో కూడిన సాగు చేయాలన్నారు. రైతులంతా వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది సూచనలను విధిగా పాటించాలన్నారు. అనంతరం రైతులకు ఉచితంగా మందులను ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు, ఏలూరు ఏడీఏలు డాక్టర్ పి.ఉషారాజకుమారి, కె.సుబ్బారావు, ఏవో ఉషారాణి, వీఏఏ, పొలంబడి రైతులు పాల్గొన్నారు.

అచ్చమ్మతల్లి దర్శనానికి ఆహ్వానం

దెందులూరు: కోస్తా జిల్లాల్లో భక్తుల పాలిట కొంగు బంగారంగా ఇలవేల్పుగా విరాజిల్లుతున్న గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ దర్శనానికి రావాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గంటా కోటేశ్వరరావు తదితరులు రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ పీ.మిథున్‌రెడ్డిని కోరారు. మంగళవారం తాడేపల్లిలో ఆయన నివాసంలో వైఎస్సార్ సీపీ నాయకులు మణికంఠ కన్‌స్ట్రక్షన్ అధినేత గంటా కోటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి దెందులూరు నియోజకవర్గం, గాలాయగూడెంలో చేస్తున్న అభివృద్ధిని వారు వివరించారు. గాలాయగూడెం అమ్మవారి విశిష్టత, ఉత్సవాలు, ఆలయ అభివృద్ధిని మిథున్‌రెడ్డికి తెలిపినట్టు కోటేశ్వరరావు పేర్కొన్నారు.

వెలమ సామాజిక వర్గానికి సముచిత స్థానం



జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులను సత్కరిస్తున్న కొఠారు రామచంద్రరావు

పెదపాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కొప్పుల వెలమలకు అధిక ప్రాధాన్యత నిచ్చారని, వారంతా పార్టీకి వెన్నుదన్నుగా నిలవాలని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు తెలిపారు. పెదపాడులోని విత్తన శుద్ధి కర్మాగారం వద్ద కొప్పుల వెలమ ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కొఠారు రామచంద్రదరావు మాట్లాడుతూ వెలమ సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి జగన్ సముచిత స్థానం కల్పించారని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని తెలిపారు. పెదపాడు మండలంలోని వెలమ సామాజికవర్గ ప్రజలంతా భారీ ఎత్తున తరలివచ్చి ఘనంగా సత్కరించారు. గజమాలతోను శాలువాలతోను జెడ్పీ చైర్‌పర్సన్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొట్టాపు నర్సింహరావు, సీనియర్ నాయకులు సంబంగి శ్రావణ్‌కుమార్, ఏలూరు జిల్లా వెలమ సంఘం అధ్యక్షుడు మరడ అనీల్‌కుమార్, కార్పొరేటర్ కిలాడి దుర్గారావు, వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి, సత్యవోలు సర్పంచ్ రంభ ఉమామహేశ్వరి, వసంతవాడ సర్పంచ్ చింతల రమాభారతి, వీరమ్మకుంట సర్పంచ్ మరడాన చంటిబాబు, దాసరి పెదబాబు, గుణుపూరు మహేష్, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు, అక్కినేని రాజశేఖర్, అక్కినేని గోపీ చంద్ర దుర్గాప్రసాద్, వైస్ ఎంపీపీ అప్పన పద్మావతి, స్థానిక సర్పంచ్ కొత్తూరి జీవనకుమారి, సీనియర్ నాయకుడు గారపాటి బాస్కరరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వర్గీకరణకు కట్టుబడిన వారికే మద్దతు



బాబూజగ్జీవన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంఆర్‌పీఎస్ నేతలు

పెదవేగి : ఎస్సీ వర్గీకరణకు ఏ పార్టీ కట్టుబడి ఉంటుందో వారికే ఎమ్మార్పీఎస్ మద్దతు ఉంటుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం పెదవేగి మండలం కొప్పాకలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి బ్రహ్మయ్య మాదిగ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల నుంచి అన్ని రాజకీయ పార్టీలు మాదిగ ప్రజలను మోసం చేస్తున్నాయని, హామీ ఇవ్వడం ఎన్నికలు అయిన వెంటనే వాటిని మర్చిపోతున్నాయని ఆయన తెలిపారు. ఇకనైనా మాదిగ నాయకులు రాబోయే ఎన్నికల నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా బాబూజగ్జీవన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఏటుకూరి విజయ్ కుమార్, జిల్లా నాయకులు ఎర్రా నాగమల్లేశ్వరరావు, కోడెల్లి వెంకట్రావు, కొల్లూరి రామకృష్ణ, జిజ్జువరపు రాజు, మానుకొండ ఆశీర్వాదం, శొంగ జోజి, జయరాజు, రంగారావు పాల్గొన్నారు.